క్లుప్తంగా

సేంద్రియ పంటలతో ఆరోగ్యం



సేంద్రియ ఎరువులతో పండించిన ఆకు కూరలను పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ

శిరివెళ్ల: సేంద్రియ ఎరువులతో పండించిన ఆకు కూరలు, కూరగాయలతో ఆరోగ్యం బాగుంటుందని ఇన్‌చార్జీ ఎంపీడీఓ శ్రీనివాస శర్మ అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను ఆయన పరిశీలించి మాట్లాడారు. రసాయనిక ఎరువులతో పండించిన పంటలతో ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. రక రకాల జబ్బులు వస్తున్నాయన్నారు. మండలంలో కాదరబాదర, చెన్నూరు, బోయలకుంట్లలో సేంద్రియ ఎరువులతో ఆకు కూరలు, కూరగాయలు పండిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మండల ఎస్‌డీఏ రాముడు, ఐసీఆర్‌పీలు పాల్గొన్నారు.

నాణ్యమైన నారతో మంచి దిగుబడులు



కాకరవాడలో రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయాధికారి శ్రీనివాసరెడ్డి


ఉయ్యాలవాడ : రైతులు నాణ్యమైన నారను ఎంపిక చేసుకుని వరి నాట్లు వేస్తే మంచి దిగుబడులు పొందవచ్చునని వ్యవసాయాధికారి శ్రీనివాసరెడ్డి సూచించారు. మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం మండలంలోని కాకరవాడ గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో సమావేశమై మాట్లాడారు. నారుమడిని పది నుంచి 12 రోజులు దమ్ము చేసి చదును చేసుకోవాలన్నారు. మొలక కట్టిన విత్తనాన్ని సెంటుకు 5 కిలోల చొప్పున చల్లుకోవాలన్నారు. నార పూర్తిగా పురి విచ్చుకునే వరకు నీటి తడులు ఇవ్వాలన్నారు. ఎదిగిన నారుమడిలో ఉల్లి కోడు, కాండం తొలుచు పురుగు నివారణకు మోనోక్రోటోపాస్ 1.6 మిల్లీ లీటర్లు లేదా క్లోరోపాస్ 2.0 మిల్లీ లీటర్లను ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు.

వైభవంగా అష్టాదళ పాదపద్మారాధన సేవ



నంద్యాల(వ్యవసాయం): శ్రీకాళికాంబా చంద్రశేఖరస్వామి దేవస్థానంలో మంగళవారం శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించి పట్టువస్త్రాలతో అలంకరించారు. అనంతరం 108 వెండి పుష్పాలతో అమ్మవారికి అష్టాదళ పాదపద్మారాధన సేవ నిర్వహించారు. మహా మంగళ హారతులు ఇచ్చారు. శ్రీకాళిమాత సేవా సమితి వారు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఈఓ లక్ష్మీ నారాయణ, వేదపండితులు రాఘవేంద్ర, మరణాచారి, ఆరవేటి వాసు, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాలసదనం సందర్శన



చిన్నారులతో కలిసి భోజనం చేస్తున్న జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారి

ఆళ్లగడ్డ: స్థానిక బాలసదనంను జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారి శ్రీనివాస్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన బాలసదనంలోని విద్యార్థులతో కలిసి సహపంక్తిభోజనం చేశారు. అనంతరం ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ జ్యోతిని బాలసదనంలో అవసరాలను అడిగి తెలుసుకున్నారు. 6-11 ఏళ్ల వయస్సు బాలికలు తల్లిదండ్రులను కోల్పోయి ఉంటే ప్రవేశానికి అర్హులన్నారు. ఎవరైనా ఉంటే 1098 ఫోన్ చేసి చెప్పాలను కోరారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ట్రాక్టర్

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల– ముదిగేడు ఆర్ అండ్‌బీ రహదారిలో 8.33 కేవీ సబ్‌స్టేషన్‌కు సంబంధించిన విద్యుత్ స్తంభాన్ని మంగళవారం సాయంత్రం ట్రాక్టర్ ఢీకొంది. కోవెలకుంట్ల వైపు నుంచి ఇటుకల లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ ప్రమాదశాత్తూ స్తంభాన్ని ఢీకొట్టగా స్తంభం కూలిపోయింది. అదే సమయంలో విద్యుత్ ట్రిప్ కావడంతో సరఫరా నిలిచిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కోవెలకుంట్ల విద్యుత్ సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా చేసే మెయిన్ లైన్ కావడంతో సాయంత్రం 4 నుంచి రాత్రి 7 గంటల వరకు స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ అధికారులు యుద్ధప్రాతిపదికన ఘటనా స్థలానికి చేరుకుని కొత్త స్తంభం ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి



సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు

ఇంటింటికీ బాబు మోసాలు

- ఓట్ల కోసమే ఎన్నికల్లో సూపర్ సిక్స్ పేరుతో హామీలు
- అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా పట్టించుకోలేదు
- కూటమి సర్కారుపై మాజీ ఎమ్మెల్యే శిల్పారవి, ఎమ్మెల్సీ ఇసాక్ ధ్వజం

నంద్యాల: చంద్రబాబు చేసిన మోసాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరిస్తామని మాజీ ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా అన్నారు. బాబు 40 సంవత్సరాల రాజకీయ జీవితంలో ఎన్నడూ నిజాలను మాట్లాడలేదని మండిపడ్డారు. గత ఎన్నికల సమయంలో కూడా సూపర్ సిక్స్ పేరుతో హామీలు ఇచ్చి వాటిని అమలు చేయకుండా దగా చేశారని ధ్వజమెత్తారు. మంగళవారం నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని 1,2,3,5, వార్డుల పరిధిలో ఉన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో నడిగడ్డలోని కన్యకా పరమేశ్వరి స్కూల్‌లో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శిల్పారవి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా మాట్లాడుతూ రాష్ట్రంలో 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు ప్రతి నెలా ఆడబిడ్డ నిధి కింద ఇస్తామన్న రూ.1,500 ఎందుకు ఇవ్వడం లేదో చెప్పాలన్నారు. ప్రతిసారి నిరుద్యోగులను నమ్మించి మోసం చేయడం చంద్రబాబుకు అలవాటుగా మారిందన్నారు. 2024 ఎన్నికలో మేనిఫెస్టోలో నిరుద్యోగ భృతి హామీ ఇచ్చి ఏడాది గడిచినా పట్టించుకోవడం లేదని చెప్పారు. ఇలా అన్ని వర్గాల ప్రజలను ఓట్ల కోసం నమ్మించి దగా చేశారన్నారు.

బ్లాక్ మార్కెట్‌కు యూరియా

ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఇవ్వాల్సిన యూరియాను టీడీపీ నాయకులు, కార్యకర్తలే పంచుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి ఆరోపించారు. కొందరు ఎరువులను బ్లాక్ మార్కెట్‌కు తరలించి జేబులు నింపుకుంటున్నారన్నారు. రైతు భరోసా ప్రతి ఏడాది రూ.20వేలు ఇస్తామని చెప్పి ఒక ఏడాది ఎత్తేశారన్నారు. గతంలో అమ్మ ఒడి పథకం కింద అర్హత ఉన్న ప్రతి విద్యార్థి తల్లి ఖాతాలో నగదు జమ అయ్యేదని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. నిబంధనల పేరుతో కోతలు విధిస్తున్నారన్నారు. ప్రస్తుతం ఏ పని కావాలన్నా టీడీపీ నాయకులకు డబ్బులు ముట్టజెప్పాల్సిన దుస్థితి నెలకొందన్నారు. కూరగాయలు, గ్యాస్, నిత్యావసర సరుకుల ధరలు అమాంతం పెరిగిపోయాయన్నారు. విద్యుత్ చార్జీలు అధికారంలోకి వస్తే తగ్గిస్తామని చెప్పి నేడు గతం కంటే అధికంగా సర్ చార్జీల పేరుతో ప్రజల నడ్డి విరిచి డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. ఇంటింటికి పంపిణీ చేసే రేషన్ వాహనాలను తొలగించి ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారన్నారు. కూటమి పాలనలో మద్యం ఏరులై పారుతుందని విమర్శించారు. ఎక్కడ చూసినా బెల్ట్ షాపులు దర్శనమిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, మోసాలను, అవినీతిని ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై ఉందన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నిసా, రాష్ట్ర మహిళా జనరల్ సెక్రెటరీ శశికళారెడ్డి, నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు దాల్ మిల్ అమీర్, మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, కౌన్సిలర్స్ సాదిక్ బాషా, సమ్మద్,ఆరిఫ్ నాయక్, మాజీ కౌన్సిలర్ మునయ్య, కన్నమ్మ, గౌస్, చాంద్‌బీ తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాతో ఉద్యోగ అవకాశాలు సాధించాలి

నంద్యాల: జాబ్ మేళా ద్వారా యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జాబ్ మేళా పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కోవెలకుంట్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 12న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగ యువతీ, యువకులు ఈకార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు సెల్: 9182217075, 9951400588 నంబర్లకు సంప్రదించాలని సూచించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్ రెడ్డి, జిల్లా ఉపాధి కల్పన అధికారి కళ్యాణి, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్, ఎస్సీ, ఎస్టీ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు మహేంద్రనాథ్ పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలం దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథంలో కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆలయ దక్షిణ మాడ వీధులలోని నిత్య కళావేదికపై హైదరాబాద్‌కు చెందిన జి.అరుణ, బృందం వారి భక్తిరంజని కార్యక్రమం ఆకట్టుకుంది. శరణు సిద్ధివినాయక, లింగాష్టకం, బిల్వాష్టకం, శివతాండవస్తోత్రం, కాలభైరవాష్టకం, పలు శివకీర్తనలను అరుణ, శ్రీరామకృష్ణ, అతిథి తదితరులు ఆలపించారు. కార్యక్రమానికి తబల సహకారాన్ని శంకరరావు, వయోలిన్ సహకారాన్ని అర్జున్ అందించారు.

నూతన విద్యా విధానం రాజ్యాంగానికి విరుద్ధం



మాట్లాడుతున్న హృదయరాజు

నంద్యాల(న్యూటౌన్): కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన వచ్చిన జాతీయ విద్యావిధానం రాజ్యాంగానికి విరుద్ధంగా ఉందని, దీనిని తక్షణమే రద్దు చేయాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీమన్నారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని జేకే ఫంక్షన్ హాల్‌లో పీడీఎస్‌యూ రాష్ట్ర విద్య, వైజ్ఞానిక శిక్షణ తరగతులకు ఆయన హాజరై మాట్లాడారు. విద్యను ప్రైవేట్‌పరం చేసే కుట్ర జరుగుతుందన్నారు. మోదీ ప్రభుత్వం విద్యార్థులకు, యువతకు ఏడాదికి కోటి ఉద్యోగాలు ఇస్తామని చెప్పి గాలికి వదిలేసిందన్నారు. నిరుద్యోగులు వలసలు వెళ్లి బతుకుతుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చోద్యం చూస్తున్నాయన్నారు. అలాగే మధ్యాహ్నం జరిగిన సభలో విద్యారంగ పరిస్థితులు, విద్యార్థుల కర్తవ్యం అనే అంశంపై ఏపీటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు మాట్లాడారు. విద్యార్థి సంఘాలను పాఠశాలలోకి రాకుండా కూటమి ప్రభుత్వం జీవోలు తీసుకొని రావడం తగదన్నారు. ఉపాధ్యాయులకు యాప్‌లు పెట్టి గందరగోళం సృష్టిస్తుందన్నారు. ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ కార్యదర్శి శంకర్, రాంబాబు, పీడీఎస్‌యూ ఉపాధ్యక్షులు రాజశేఖర్, జునైద్‌బాషా, సహాయ కార్యదర్శి రాజేష్, మహేంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి



సమావేశంలో మాట్లాడుతున్న చెన్నయ్య

నంద్యాల(అర్బన్): రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు చెన్నయ్య రైతులకు సూచించారు. మండలంలోని చాబోలు గ్రామంలో మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన రైతు శిక్షణ కార్యక్రమంలో చెన్నయ్య మాట్లాడుతూ వరి పంటలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరించారు. ప్రస్తుతం వరి నారుమడిలో రెండు గ్రాముల జింక్ సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారీ చేయడంతో జింకు లోపం నివారణ అవుతుందన్నారు. అలాగే ఐదు సెంట్ల నారుమడికి 2 కేజీల నత్రజని, ఒక కిలో పొటాష్ ఎరువు వేయాలన్నారు. కార్యక్రమలలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి వెంకటేశ్వరరెడ్డి, విస్తరణ అధికారులు మనోహర్, శ్రీధర్, బాలలింగమయ్య, రైతు సేవా సిబ్బంది హర్షిత, రైతులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు వద్దే వద్దు

నంద్యాల(న్యూటౌన్): విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయరాదని వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ మంగళవారం ఆ ఐక్యవేదిక ఆధ్వర్యంలో జిల్లాలోని ట్రాన్స్‌కో కార్యాలయం, జాతీయ రహదారులపై ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. నంద్యాల జరిగిన కార్యక్రమంలో సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్, ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ పుల్లా నరసింహ, అన్సర్‌బాషా, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్‌వైడీ ప్రసాద్, క్రిస్టియన్ జేఏసీ కన్వీనర్ జానయ్య మాట్లాడుతూ ప్రభుత్వం విద్యుత్‌చార్జీలు పెంచి ప్రజలపై భారం వేస్తుందన్నారు. అదానీకి మేలు చేయడం కోసం కూటమి సర్కారు స్మార్ట్‌మీటర్లను బిగిస్తుందని ఆరోపించారు. ఆర్ఎస్‌యూ పార్టీ నాయకులు సుబ్బరాయుడు, సీపీఐ నాయకులు బాబాఫక్రుద్దీన్,ప్రసాద్,తోటమదు,లక్ష్మణ్, పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను తొలగించాలి

గోస్పాడు: విద్యుత్ శాఖ ఏర్పాటు చేసిన స్మార్ట్ మీటర్లను తొలగించి విద్యుత్ చార్జీలు తగ్గేలా చూడాలని సీపీఐ మండల నాయకులు హరినాథ్, జిలానీ బాషా డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన గోస్పాడు విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట మంగళవారం వారు ఆందోళన నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో చార్జీలు పెంచి వేల కోట్ల రూపాయలు పేద ప్రజలపై భారం మోపిందన్నారు. ఎన్నికలకు ముందు స్మార్ట్ మీటర్లు బిగించమని చెప్పి ఇప్పుడు వాటిని ఏర్పాటు చేస్తుందన్నారు. అధికారం కోసం కూటమి నాయకులు ప్రజలను నమ్మించి మోసం చేశారన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మౌలా, సుంకన్న, చాపల్లి మద్దిలేటి, అంకన్న, మౌలాలి పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యం



బాలింతలు, గర్భిణులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ వైద్యాధికారులు

గోస్పాడు: తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యమని నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మల్లీశ్వరి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ లలిత అన్నారు. మంగళవారం తల్లిపాల వారోత్సవ కార్యక్రమాన్ని ఐఎంఏ ఆధ్వర్యంలో నంద్యాల ప్రభుత్వాసుపత్రిలో తల్లి బిడ్డల ప్రత్యేక విభాగంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిడ్డను ప్రసవించిన వెంటనే తల్లి పాలను తప్పని సరిగా తాపించాలన్నారు. ముర్రుపాలలో బిడ్డలకు రోగ నిరోధక శక్తి లభిస్తుందన్నారు. బిడ్డలకు పాలు ఇచ్చిన తల్లులకు రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశం తక్కువగా ఉంటుందన్నారు. శిశువు ఎదుగుదలకు కూడా తల్లి పాలకు మించిన మరొక ఆహారం లేదన్నారు. ఆసుపత్రిలోని గర్భిణులు, బాలింతలకు నెరవాటి ఆసుపత్రి వారి సౌజన్యంతో 200 మందికి పండ్లు, బ్రెడ్లు అందజేశారు. కార్యక్రమంలో ఐఎంఏ మాజీ అధ్యక్షుడు రవికృష్ణ, డాక్టర్లు పద్మజ, అరుణజ్యోతి, నెరవాటి అరుణకుమారి, వినోద్‌కుమార్, మధుసూదనరావు, సహదేవుడు పాల్గొన్నారు.

పొలానికి వెళ్లి..వరినాట్లు వేసి



విద్యార్థులతో వరి నాట్లు వేయిస్తున్న దృశ్యం

రుద్రవరం: మండల పరిధిలోని తువ్వపల్లె తిప్పమీదున్న ఏపీమోడల్ పాఠశాల విద్యార్థులు మంగళవారం పొలంలో వరి నాట్లు వేశారు. అగ్రికల్చర్ సబ్జెక్టులో భాగంగా ఒకేషనల్ ట్రైనర్ జ్యోతి ప్రియ, ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరావు విద్యార్థులకు వ్యవసాయ రంగంపై అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా పాఠశాలకు సమీపంలోని మాగాణి పొలానికి విద్యార్థులను తీసుకెళ్లారు. అక్కడ వారు విద్యార్థులకు వరి నారు, నారు నాటే విధానం, పెంపకం, నేల రకా లు,సేంద్రియ ఎరువుల వినియోగం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం ఉన్నారు.

ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన ప్రమాణాలు

- వైద్యాధికారులతో జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన ప్రమాణాలను పాటించి కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న ప్రోత్సాహకాలు పొందాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో డిస్ట్రిక్ట్ క్వాలిటీ అస్యూరెన్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రులకు వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందజేయాలన్నారు. అనంతరం ఆసుపత్రుల్లో సదుపాయాల ఏర్పాటుకు కృషి చేసిన 16 మంది వైద్య సిబ్బందికి కలెక్టర్ సర్టిఫికెట్లు అందజేశారు. సమావేశంలో డీఎంహెచ్ఓ వెంకటరమణ, జీజీహెచ్ సూపరింటెండెంట్ మల్లీశ్వరి, డీసీహెచ్ఎస్ లలితా, డీపీఎంఓ అంకిరెడ్డి, డిస్ట్రిక్ట్ క్వాలిటీ కన్సల్టెంట్స్ లక్ష్మణ్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బాలికల వసతి గృహంలో టాయిలెట్లు ప్రారంభం

పట్టణంలోని ఎస్పీ కార్యాలయం ఎదురుగా ఉన్న బీసీ సంక్షేమ బాలికల వసతి గృహంలో సీఎస్ఆర్ నిధులు రూ.13 లక్షలతో నిర్మించిన 6 టాయిలెట్లను మంగళవారం జిల్లా కలెక్టర్ రాజకుమారి ప్రారంభించారు. ఈ వసతి గృహంలో విద్యను అభ్యసిస్తున్న బాలికలు సరిపడా టాయిలెట్లు లేక ఇబ్బంది పడుతుండటంతో రాయలసీమ ఎక్స్‌ప్రెస్ వే ప్రైవేట్ లిమిటెడ్ వారికి కలెక్టరు సూచించారు. ఈ మేరకు వారు నూతనంగా నిర్మించిన 6 టాయిలెట్ బ్లాక్‌లను కలెక్టర్ ప్రారంభించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి జగ్గయ్య, రాయలసీమ ఎక్స్‌ప్రెస్ ప్రాజెక్ట్ హెడ్ మదన్‌మోహన్ వంగర, వారి సిబ్బంది, వసతి గృహం విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.



నూతన టాయిలెట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

19 నుంచి పీ4 అమలు

ఈనెల 19 నుంచి పీ4 అమలు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి తెలిపారు. మంగళవారం రాష్ట్ర సచివాలయం నుంచి పీ4 (ప్రభుత్వ- ప్రైవేటు- ప్రజల-భాగస్వామ్యం) కార్యక్రమంపై మంత్రులు, జిల్లా కలెక్టర్లు, ప్రజా ప్రతినిధులతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన మేరకు జిల్లాలో పీ4 అమలును ఒక ఉద్యమ స్ఫూర్తితో ముందుకు తీసుకెళ్లాలన్నారు. జిల్లాలో పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పనిచేయాలన్నారు. కాన్ఫరెన్స్‌లో జిల్లా అధికారులు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థికి రూ.50వేలు ఆర్థిక సాయం

పట్టణ పరిధిలోని బొమ్మలసత్రం క్రాంతినగర్‌కు చెందిన బంగారు కుటుంబంలోని విద్యార్థి ఎం.రోహన్ సాయి వార్షిక హాస్టల్ ఫీజు నిమిత్తం రూ.50వేలు అదే ఏరియాకు చెందిన దంపతులు, ఉపాధ్యాయులు సాంబశివుడు, కె.శివకుమారి అందజేశారు. మంగళవారం కలెక్టర్ చేతుల మీదుగా ఆ మొత్తాన్ని అందించారు. విద్యార్థి విజయనగరం ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ 2వ సంవత్సరం చదువుతున్నాడు. ఈ విద్యార్థి చదువు పూర్తయ్యే వరకు వసతి గృహం ఫీజు తామే చెల్లిస్తామని టీచర్లు కలెక్టరుకు తెలిపారు.

దంతాలు శుభ్రంగా ఉంచుకోవాలి

గోస్పాడు: దంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని దంత వైద్యులు సూర్యచైతన్యరెడ్డి, హరితారెడ్డి అన్నారు. మండల కేంద్రమైన జూనియర్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు ప్రిన్సిపాల్ సునీత ఆధ్వర్యంలో దంత పరీక్షలు నిర్వహించారు.


దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలోని ప్రభుత్వ జిల్లా పరిషత్, మున్సిపాలిటీ, ఎయిడెడ్ ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్, పీఈటీల స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎంపికకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీఈఓ జనార్ధన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఆసక్తి గల సీనియర్ స్కూల్ అసిస్టెంట్, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఏపీ మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ కార్యవర్గం ఎన్నిక

నంద్యాల(న్యూటౌన్): ఏపీ మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ నంద్యాల పట్టణ శాఖ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. పట్టణంలోని మేఘన కోచింగ్ సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ఏపీఎంటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరెడ్డి, ఎన్నికల పరిశీలకులుగా ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్, బసవరాజు వ్యవహరించారు. నంద్యాల పట్టణ శాఖ గౌరవాధ్యక్షుడిగా వరప్రసాదరెడ్డి, అధ్యక్షుడిగా దేవేంద్ర, ప్రధాన కార్యదర్శిగా మహేంద్రారెడ్డి, ఉపాధ్యక్షుడిగా మహమ్మద్‌రఫీ, కోశాధికారిగా సురేష్, సహాయ కోశాధికారిగా జమీల్ అహమ్మద్, సమాచార కార్యదర్శిగా ఈశ్వరరెడ్డి, రవితేజతో పాటు నంద్యాల జిల్లా అధ్యక్షుడిగా దస్తగిరి, ఉపాధ్యక్షుడిగా రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా నాగేశేషులు, గౌరవాధ్యక్షులుగా గురురాజ, ప్రసాదరావు, పుల్లయ్యనాయక్‌లను ఎన్నుకున్నట్లు వెంకటరెడ్డి తెలిపారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి



కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికైన యువకుడిని సత్కరిస్తున్న గ్రంథాలయ కార్యదర్శి ప్రకాష్

నంద్యాల(వ్యవసాయం): పోటీపరీక్షలకు ప్రిపేర్ అయ్యే విద్యార్థులు, యువకులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.ప్రకాశ్ అన్నారు. శ్రీ పింగళి సూరన స్మారక శాఖ గ్రంథాలయంలో చదువుకొని కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికైన కె.వెంకటేశ్వర్లును మంగళవారం సత్కరించారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు అవసరమైన అన్ని పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని నిరుద్యోగులు ఉపయోగించుకోవాలన్నారు. గ్రంథాలయ సిబ్బంది ఆర్‌ఈ శ్రీధర్, గ్రంథాలయ పాఠకులు ఆదినారాయణ, శ్రీనివాసులు, ప్రియాంక పాల్గొన్నారు.

వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన

ఉయ్యాలవాడ: వాట్సాప్ మిత్ర యాప్ ద్వారా ఇంటి వద్దే ప్రభుత్వ సేవలు పొందవచ్చునని తహసీల్దార్ సువర్ణాదేవి, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు ప్రజలకు సూచించారు. మంగళవారం స్థానిక మోడల్ స్కూల్, జిల్లా పరిషత్ విద్యార్థులతో వాట్సాప్ గవర్నెన్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం గృహాల వద్దకు వెళ్లి ప్రభుత్వం ప్రవేశపెట్టిన వాట్సాప్ నంబర్‌ను ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు రఘురామిరెడ్డి, వీరప్రతాప్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి జయరామిరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రుద్రవరం: మన మిత్ర సేవలను సద్వినియోగం చేసుకోవాలని మండల పర్యవేక్షణ అధికారి సుబ్రమణ్యం ప్రజలకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి ఎంపీపీ బాలస్వామి అధ్యక్షతన మండల పరిషత్, సచివాలయ ఉద్యోగులు విద్యార్థులతో కలిసి మన మిత్రపై అవగాహన కల్పిస్తూ మంగళవారం ర్యాలీ నిర్వ హించారు.

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

నంద్యాల(న్యూటౌన్): జర్నలిస్టుల సమస్యలు కూటమి ప్రభుత్వం పరిష్కరించాలని ఏపీయూడబ్ల్యూజే గౌరవ సలహా దారులు జనార్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం జర్నలిస్టుల డిమాండ్స్‌డే సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారికి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పని చేస్తున్న జర్నలిస్టులందరికీ అక్రిడియేషన్లు ఇవ్వాలని, రాష్ట్ర, జిల్లా స్థాయి అక్రిడియేషన్ కమిటీలో జర్నలిస్టుల యూనియన్‌కు ప్రాతినిధ్యం కల్పించాలని, జర్నలిస్టుల హెల్త్ స్కీమ్ ప్రయోజనకరంగా తీర్చిదిద్దాలని కోరారు. వర్కింగ్ జర్నలిస్టుల ప్రమాద బీమా పథకాన్ని పునరుద్ధరించాలని, విశ్రాంత పాత్రికేయులకు ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న పెన్షన్ పథకాన్ని ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే నాయకులు శ్యాంసుందర్‌లాల్, కనకరాజు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మధుబాబు, ఉస్మాన్‌బాషా, చలంబాబు, బాలు నాయక్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

ఐరా ఆధ్వర్యంలో...

రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులందరికీ కొత్త అక్రిడియేషన్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఇండియన్ రిపోర్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ, జాషువా, శరత్‌బాబు, విజయ్‌బాబు, శ్రీనివాసులు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజు రాయితీ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐరా సంఘం నాయకులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలు ఐదు రోజులు



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న గణేష్ మహోత్సవ కేంద్ర సమితి సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): వినాయక చవితి పండుగను పురస్కరించుకొని గణేష్ ఉత్సవాలను ఈనెల 27 నుంచి 31వ తేదీ వరకు ఐదు రోజుల పాటు వైభవంగా నిర్వహిస్తున్నట్లు శ్రీ గణేష్ మహోత్సవ కేంద్ర సమితి సభ్యులు విజయ కుమార్, చలంబాబు తెలిపారు. మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ రాజకుమారిని కలిసి గణేష్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమం నిర్వహణపై చర్చించి వినతి పత్రం అందజేశారు. ఉత్సవాలను విజయవంతంగా పూర్తి చేసేందుకు అన్ని శాఖల పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో గణేష్ మహోత్సవ కేంద్ర సమితి సభ్యులు శంకర్, మోహన్ గుప్తా, చంద్రమోహన్, పుల్లయ్య, కృష్ణమాచార్యులు, పవన్ కుమార్, కృష్ణ తదితరులు ఉన్నారు.